సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



మల్బరీ.. లాభాల సిరి
మల్బరీ సాగు విస్తీర్ణం క్షీణిస్తున్న తరుణంలో ప్రభుత్వం చేయూతనిస్తోంది. రైతులకు రాయితీలు కల్పిస్తోంది. - 8లో



రేషన్ బియ్యం స్వాధీనం
సిద్దవటం మండలం కమ్మపాల్లె గ్రామంలో అక్రమంగా తరలించేందుకు నిల్వ ఉంచిన 502 బస్తాల ప్రభుత్వ రేషన్ బియ్యం డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.280	రూ.370
రెండోరకం	రూ.160	రూ.278

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 110 మెట్రిక్ టన్నులు



వందే భారత్.. దారెటు!



టికెట్ ధర రూ.1150 నుంచి మొదలు

గమ్యస్థానం చేరే సమయం 6 నుంచి 7 గంటలు

వేగం గంటకు 130 నుంచి 150 కి.మీ

సర్వే జరిగిన రూట్లు 3

- సికింద్రాబాద్‌-తిరుపతి మధ్య వందేభారత్
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రైలుమార్గంలో ట్రయల్‌రన్
- పరిశీలనలో పలు రైలు మార్గాలు
- పచ్చజెండా ఊపనున్న దక్షిణ మధ్య రైల్వే
- ఈనెలాఖరుకు అందుబాటులోకి వచ్చే అవకాశం

రాజంపేట : దక్షిణమధ్య రైల్వే త్వరలో నడపనున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఏ మార్గంలో పరుగులు తీయనుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతి- దక్షిణమధ్య రైల్వే జోన్ కేంద్రమైన సికింద్రాబాద్ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు నడిపేందుకు సర్వం సిద్ధమవుతోంది. ప్రయాణికులు ఎదురుచూస్తున్న ఈ రైలు ముంబయి-చెన్నై రైలుమార్గంలోని ఉమ్మడి వైఎస్సార్ జిల్లాల మీదుగా నడిపిస్తారా? లేక వేరే మార్గంలో తిరుపతికి నడిపిస్తారా అనేది బహిర్గతం కాలేదు. కానీ ఈ నెలాఖరుకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును అందుబాటులోకి తీసుకు రానున్నట్లు రైల్వే అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

ఓ మారు ట్రయల్‌రన్..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కడప మీదుగా ఓ మారు ట్రయల్ రన్ నిర్వహించారని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలోనే ఈ రైలు నడుస్తుందని ఆశిస్తున్నారు. ఈమేరకు త్వరలో దక్షిణ మధ్య రైల్వే పచ్చజెండా ఊపనుంది. ఇందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. మరోవైపు రైలు ప్రయాణమార్గం , టికెట్ ధర, రైలు నంబరు వంటి వాటిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

రూ.1150 నుంచి టికెట్ ధర

వందేభారత్ రైలు టికెట్ ధర రూ.1150 నుంచి ప్రారంభం కానుంది. జీఎస్టీ, తత్కాల్ సర్‌చార్జీతో కలిపి ప్రయాణపు ధర ఉండవచ్చని తెలుస్తోంది. టికెట్‌చార్జి, రైలు నంబరు ఖరారు కాగానే ప్రయాణికుల అధికారిక ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో పొందపరచనున్నారు.

రైలుమార్గాల అన్వేషణలో..

ఇప్పటికే తెలుగు రాష్ట్రాలలో మొదటగా సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య ఈ రైలు నడుస్తుండగా, రెండవది సికింద్రాబాద్- తిరుపతి మధ్య పట్టాలెక్కనుంది. అందుకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే ప్రణాళిక సిద్ధం చేసుకుంటోంది. ప్రస్తుతం రైలు మార్గాలను అన్వేషిస్తున్నారు.

6 నుంచి 7 గంటల్లోనే గమ్యానికి..

సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడవనున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆరేడు గంటల్లోనే గమ్యానికి చేరుతుందని రైల్వే వర్గాలు అంచనా వేస్తున్నాయి. సాధారణంగా తిరుపతి-సికింద్రాబాద్ మధ్య నడిచే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ సమయం 12 గంటలు పడుతోంది. దీన్ని బట్టి చూస్తే తిరుమల, తిరుపతికి వచ్చే యాత్రికులు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును అధికంగా ఆశ్రయించనున్నారు.

రైలు మార్గాలపై సర్వే..

ప్రధానంగా సికింద్రాబాద్-తిరుపతి మధ్య నడవనున్న వందేభారత్ రైలు ఏ రూట్‌లో నడిపించాలనే అంశంపై తర్జనభర్జన జరుగుతోంది. ఇప్పటికే బీబీనగర్, నడికుడి, మిర్యాలగూడ మార్గం అలాగే సికింద్రాబాద్, కాచిగూడ, కడపతో పాటు బీబీనగర్ నుంచి గుంటూరు, నెల్లూరు, గూడూరు మార్గంలో సర్వే జరిగినట్లు తెలుస్తోంది. ఈ మూడు మార్గాలే కాకుండా పిడుగురాళ్ల జంక్షన్ నుంచి శావల్యపురం మీదుగా ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట మీదుగా సర్వే చేశారని రైల్వే వర్గాలు అంటున్నాయి.

తక్కువ దూరంపైనే..

రైల్వే అధికారులు తక్కువ దూరంగా ఉండే రైలుమార్గాన్ని ఎంచుకోనున్నారని స్పష్టమవుతోంది. గంటకు 130 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా ట్రాక్‌ల పటిష్టత, వంతెన నిర్మాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఆ తర్వాత మార్గాన్ని ఖరారు చేసి అధికారికంగా ప్రకటించనున్నట్లు రైల్వే వర్గాల సమాచారం.

హాల్టింగ్స్‌పై రేకెత్తుతున్న ఆశలు..

వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉమ్మడి వైఎస్సార్ జిల్లా మీదుగా పరుగులు తీస్తే, హాల్టింగ్స్‌పై ప్రయాణికుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ద్వారా అటు తెలంగాణకు, ఇటు తిరుపతికి వెళ్లేందుకు తక్కువ వ్యవధిలోనే చేరుకోవచ్చన్న భావనలో ప్రయాణికులు ఉన్నారు. కనీసం కడపలో హాల్టింగ్స్ ఉంటే మేలు అని వారు ఆశిస్తున్నారు.

రైలుమార్గంలో ట్రాక్ రికార్డింగ్ కార్..

గుత్తి-రేణిగుంట డబ్లింగ్ మార్గంలో ట్రాక్‌ను ట్రాక్ రికార్డింగ్ కార్ పరిశీలిస్తోంది. ఇటీవల ఈ మార్గంలో పలురైళ్ల వేగం 130 కి.మీ వేగం పెంచారు. మరోవైపు రైళ్ల వేగంతో రైలుపట్టాల స్థితి గతులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ట్రాక్‌రికార్డింగ్‌కార్ రైలు పర్యటిస్తోంది. రైలుపట్టాల సామర్థ్యం, వెల్డ్‌ఫెయిలర్స్, రైలుపట్టాల నాణ్యత, వేగాన్ని తట్టుకునే పరిస్థితులున్నాయా? ఇలా అన్ని విషయాలను పరిశీలించనున్నారు.



చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న పౌరసరఫరాల సంస్థ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్

- రైస్‌కార్డు దారులకు చిరుధాన్యాల పంపిణీ
- ఆర్బీకేల ద్వారా మద్దతు ధరతో రైతుల నుంచి కొనుగోలు
- రీజినల్ సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల సంస్థ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, వీసీఎండీ వీరపాండ్యన్

కడప సిటీ : చిరుధాన్యాల సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్, ఎండీ వీరపాండ్యన్‌లు పేర్కొన్నారు. సోమవారం కడప కలెక్టరేట్‌లోని వీసీ హాలులో చిరుధాన్యాల కొనుగోలు ప్రక్రియకు సంబంధించి రాష్ట్ర పౌరసరఫరాలశాఖ సంస్థ వీసీ ఎండీ వీరపాండ్యన్‌తో కలిసి ఆ శాఖ కమిషనర్ అరుణకుమార్ వైఎస్సార్, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల జేసీలు, పౌరసరఫరాలశాఖ డీఎంలు, డీఎస్‌ఓలు, మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ జిల్లా అధికారులతో ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జేసీ సాయికాంత్‌వర్మ, నంద్యాల జిల్లా జేసీ నిశాంతి, సత్యసాయి జిల్లా జేసీ టీఎస్ చేతన్, అసిస్టెంట్ కలెక్టర్లు రాహుల్‌మీనా, ప్రశాంత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన ఆహార ధాన్యం వరితోపాటు పోషక విలువలు సమృద్ధిగా ఉన్న చిరుధాన్యాలను విస్తారంగా సాగులోకి తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. ఇప్పటికే రైస్ కార్డు దారులకు బియ్యానికి ప్రత్యామ్నాయంగా రాగి, జొన్న, చిరుధాన్యాలను కూడా ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ దేశంలో చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని విస్తృతంగా పెంచే చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగానే 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించాయన్నారు. చిరుధాన్యాలను కూడా భారీ స్థాయిలో కొనుగోలు పెంచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మన రాష్ట్రంలోనే రేషన్‌కార్డు దారులకు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో ఆరుతడి పంటగా అధిక మొత్తంలో చిరుధాన్యాలు పండిస్తున్నారన్నారు. రైతులు పండించిన చిరుధాన్యాలను ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసిన వెంటనే నగదుకూడా జమ చేస్తామని తెలిపారు. పౌరసరఫరాలశాఖ ఎండీ వీరపాండ్యన్ మాట్లాడుతూ చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంలో భాగంగా రైతుల్లో అవగాహన పెంపొందించాలన్నారు. అలాగే ఇంటింటికి రేషన్ బియ్యాన్ని సరఫరా చేసే పౌరసరఫరాల వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. అంతకుముందు అన్నిజిల్లాల జేసీలు ఆయా జిల్లాల్లో చిరు ధాన్యాల సాగు పరిస్థితిపై కమిషనర్‌కు వివరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్, నంద్యాల, కర్నూలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా స్థాయి వ్యవసాయశాఖ అధికారులు, వైఎస్సార్ జిల్లా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించండి

రాయచోటి : పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పటిష్టంగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. సోమవారం విజయవాడ నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్‌మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయుల క్లెయిమ్స్ డిస్పోజల్ పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఫ్లయింగ్‌స్క్వాడ్ టీమ్స్, ఎంసీసీ టీంలు పటిష్టంగా నిఘా ఉంచాలన్నారు.

పోలీసు కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం

– జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



బాధితురాలికి ఆర్థికసాయాన్ని అందజేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి : అనారోగ్యంతో మరణించిన జి.సుబ్బరాయుడు(బార్బర్-5623) కుటుంబానికి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రూ.2 లక్షల ఆర్థికసాయాన్ని అందజేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జి.సుబ్బరాయుడు సతీమణి సుభాషిణికి ఎస్పీ ఆర్థికసాయాన్ని చెక్కురూపంలో ఇచ్చారు. పోలీస్ సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ ఆర్థికసాయం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మరణించిన సిబ్బంది కుటుంబ యోగక్షేమాలు విచారించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అలాంటి వారికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అన్నదానట్రస్టుకు రూ.12.57లక్షల విరాళాలు

తంబళ్లపల్లె : మహాశివరాత్రి సందర్భంగా మల్లయ్యకొండకు వచ్చే భక్తులకు ప్రతిఏడాది శ్రీ మల్లికార్జునస్వామి వెల్ఫేర్ అసోసియేషన్(అన్నదాన ట్రస్టు) ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి భక్తులు ఇచ్చిన విరాళాలను లెక్కించగా కౌంటర్ ద్వారా అందిన విరాళాలు రూ.10.50లక్షలు, భక్తులు ఇచ్చిన సరుకులు వేలం నిర్వహించగా రూ.2.07,320లు మొత్తం రూ.12,57,320ల ఆదాయం వచ్చినట్లు అన్నదాన ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డిలు సోమవారం విలేకరులకు తెలిపారు.

పొన్నపురెడ్డికి పట్టం!

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి
- జమ్మలమడుగులో ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా వీరి కుటుంబం ప్రాతినిధ్యం
- ఇచ్చిన మాట మేరకు ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిని ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. సుదీర్ఘకాలంగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న పొన్నపురెడ్డి కుటుంబానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్సీ కేటాయించారు. స్థానిక సంస్థల పరిపాలకులుగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు 98 శాతం మంది ఉన్నారు. ఒక్క మండలం మినహా మిగిలిన అన్ని మండలాల్లో ఆ పార్టీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు కొనసాగుతున్నారు. కడప కార్పొరేషన్‌తోపాటు, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్, కమలాపురం, రాజంపేట, రాయచోటి, జమ్మలమడుగు, పులివెందుల మున్సిపాలిటీల్లో కూడా వైఎస్సార్‌సీపీ పాలకమండళ్లు కొలువై ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అతి సునాయాసంగా విజయం సాధించనుందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

జమ్మలమడుగుకు ప్రాధాన్యత..


జిల్లాలో జమ్మలమడుగు నియోజకవర్గానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. అక్కడి ప్రత్యక్ష రాజకీయాల్లో 1983 నుంచి నాలుగు దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న పొన్నపురెడ్డి కుటుంబానికి ఈమారు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కేటాయించారు. 1983, 85, 89, 94, 1999 వరకు ఎమ్మెల్యేగా ఆ కుటుంబం నుంచి ప్రాతినిధ్యం వహించారు. 1989లో ప్రత్యక్ష రాజకీయాల్లో వచ్చిన రామసుబ్బారెడ్డి గుండ్లకుంట సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటికే ఆయన పినతండ్రి, మాజీ మంత్రి పొన్నపురెడ్డి శివారెడ్డి జిల్లా రాజకీయాల్లో క్రియాశీలక నాయకుడుగా తనదైన ముద్ర వేసుకున్నారు. తొలిసారి 1983లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన శివారెడ్డి తర్వాత టీడీపీలో చేరారు. 1985, 89లో జమ్మలమడుగు నుంచి గెలుపొంది, హ్యాట్రిక్ సాధించారు. 1985లో ఎన్టీఆర్ కేబినెట్‌లో కార్మికశాఖ మంత్రిగా పనిచేశారు. తిరిగి 1989లో ఎమ్మెల్యేగా ఎన్నికైన పి.శివారెడ్డి హత్యతో నియోజకవర్గ రాజకీయాల్లోకి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి అరంగ్రేటం చేశారు. 1994లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయనకు ఎన్టీఆర్ కేబినెట్‌లో స్థానం దక్కింది. 1999లో మరోమారు గెలుపొందడంతో చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా అవకాశం లభించింది. 2004 నుంచి 2019 వరకు వరుసగా జమ్మలమడుగు నుంచి రామసుబ్బారెడ్డి ఓటమి చవి చూశారు. కాగా 2016లో మరోమారు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రెండేళ్ల తిరక్కమునుపే అప్పటి టీడీపీ అధినేత చంద్రబాబు శల్యరాజకీయాల కారణంగా ఎమ్మెల్సీ పదవి వదిలేయాల్సి వచ్చింది.

ఆదినుంచి టీడీపీలో ఉన్నా..

1983లో స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన పొన్నపురెడ్డి శివారెడ్డి ఆ తర్వాత టీడీపీలో చేరిపోయారు. అప్పటి నుంచి 2019 వరకూ పొన్నపురెడ్డి కుటుంబం తెలుగుదేశం పార్టీనే అంటిపెట్టుకొని ఉంది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ పొన్నపురెడ్డి కుటుంబాన్ని విస్మరించిందనే చెప్పాలి. 35 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీనే సర్వస్వం అనుకున్న పొన్నపురెడ్డి కుటుంబాన్ని కాదని రాజకీయ బద్ధ విరోధులైన అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డిని చంద్రబాబు టీడీపీలోకి తీసుకున్నారు. ఆ తర్వాత మంత్రి పదవి కూడా ఇచ్చారు. ఈ పరిణామం ఆ కుటుంబానికి ఏమాత్రం రుచించలేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కాదనకుండా గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కేటాయించి మమ అన్పించారు. 2019లో మరోమారు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిచ్చి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించారు.

చెప్పిన మాట ప్రకారమే..

అత్యంత విశ్వాసంగా ఉన్నా, అవమానాలపాలు చేసిన టీడీపీకి గుడ్‌బై చెప్పేందుకు పొన్నపురెడ్డి కుటుంబం సిద్ధమైంది. ఈ క్రమంలో వియ్యంకుడు నంద్యాల వైఎస్సార్‌సీపీ నేత రాజగోపాల్‌రెడ్డి ద్వారా రామసుబ్బారెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. సౌమ్యుడు, వివాదరహితుడైన మాజీ మంత్రి రామసుబ్బారెడ్డిని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. అప్పట్లోనే కరాఖండిగా ఎమ్మెల్సీ కేటాయిస్తామని, ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై ఆశ పెట్టుకోవద్దని సీఎం వైఎస్ జగన్ తేల్చి చెప్పినట్లు రాజకీయ వర్గాలు వివరిస్తున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది.



సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామసుబ్బారెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రేపు నామినేషన్

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఈనెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు సమాచారం. మార్చి 13న పోలింగ్ నిర్వహించే ఈ ఎన్నికల్లో 911 మంది సభ్యులున్నారు. వారిలో కొందరు ఇటీవల మరణించారు. కడపలో కార్పొరేటర్లు బోలా పద్మావతి, డి.ఆనంద్, తాజాగా పులివెందుల జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి సైతం ఉన్నారు. మిగిలిన ఓటర్లతో పోలింగ్ నిర్వహించనున్నారు. 98 శాతం సభ్యులున్న వైఎస్సార్‌సీపీకి ఏకగ్రీవంగా ఎమ్మెల్సీ దక్కే అవకాశం అధికంగా ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

సామాజిక న్యాయం చేయడంలో నంబర్ వన్ సీఎం జగన్

– వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి : సామాజిక వర్గాలకు న్యాయం చేయడంలో దేశంలోనే నంబర్ వన్ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. అన్ని చోట్లా బీసీలకు 50 శాతం కేటాయించడం, రాజ్యసభ సభ్యత్వంలో కూడా బీసీలకు పెద్దపీట వేయడం చూశామని.. నేడు శాసన మండలి ఎన్నికలలో 68.5 శాతం బీసీలకు ఇవ్వడమన్నది చరిత్రాత్మకమన్నారు. అలాగే కేబినెట్‌లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది కూడా సీఎం జగనే అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటిస్తే అందులో 11 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒక ఎస్టీలుండటం జగనన్న ఉదారతను చాటుతోందన్నారు. సామాజిక పరంగా తీసుకుంటే అసెంబ్లీ స్పీకర్‌గా బీసీ, మండలి చైర్మన్‌గా ఎస్సీ, డిప్యూటీ చైర్‌పర్సన్‌గా మైనార్టీ మహిళకు ఇచ్చారన్నారు. విమర్శలకు తావివ్వకుండా అట్టడుగు వర్గాల నుంచి అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తుండటం సంతోషదాయకమన్నారు.

సీఎం వైఎస్ జగన్ దేశానికే ఆదర్శం

– ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



రైల్వేకోడూరు : సామాజిక న్యాయం చేయడంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఒక రాష్ట్రంలో ఇంత సామాజిక న్యాయం జరిగిన తీరు ఏ ముఖ్యమంత్రి పరిపాలనలో చూడలేదన్నారు. ముందుచూపు ధోరణితో అన్ని వర్గాల్లో నాయకులు తయారయ్యే విధంగా ప్రతి ఒక్కరికి ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. ఎమ్మెల్సీ పదవుల కేటాయింపులో 12 స్థానాలు బీసీలకు కేటాయించడం చాలా గొప్ప విషయమన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం తగదు


– జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : స్పందన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా గడువులోపు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, డ్వామా పీడీ మద్దిలేటిలు ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాధితుల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు.

గంగమ్మ జాతరకు వేళాయె!

- నేటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి : లక్షలాదిగా తరలిరానున్న గంగమ్మ దేవత జాతరకు ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు, పోలీసులు సర్వం సిద్ధం చేశారు. మంగళవారం నుంచి రెండురోజులపాటు అత్యంత వైభవంగా జాతర జరగనుండటంతో భక్తులకు సర్వదర్శనంతోపా టు వీఐపీ, వీవీఐపీలకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. జాతరకు సుదూర ప్రాంతాల వారు ఇప్పటికే చేరుకోవడంతో గంగమ్మ దేవతకు మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలు అర్పించి బోనాలు సమర్పించుకుంటున్నా రు. జాతర ప్రాంగణమంతా చిరు వ్యాపారులు, బెల్లపు చెరుకులు, మట్టికుండలు, శీతలపానీయాల దుకాణా లు, చిన్నపిల్లల బొమ్మల దుకాణాలతో కళకళలాడుతోంది. ఆలయ ప్రాంగణం , రాజగోపురంతోపాటు జా తరకు చేరుకునే నాలుగు మార్గాలలోను అమ్మవారిని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించడంతో ఆలయానికి జాతర శోభ సంతరించుకుంది. భక్తులకు శాశ్వత మరుగుదొడ్లతోపాటు తాత్కాలిక మ రుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక ట్యాంకర్ల ద్వా రా తాగు నీటిని అందించేందుకు దాతలు ముందుకు రావడంతో అధికారులు, ఆలయ సిబ్బంది ఎక్కడికక్క డ ముందస్తుగా ఏర్పాట్లు చేసుకున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ శ్రీధర్‌ల ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ సిబ్బందితో సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ వినోద్ కుమార్‌లు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూస్తున్నారు.



అనంతపురం గంగమ్మ దేవత



భక్తులకోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు

రమణీయం.. రథోత్సవం



ఈశ్వరా.. పరమేశ్వరా... త్రేతేశ్వరా అంటూ భక్తులు ప్రణమిల్లుతుండగా హత్యరాలలో త్రేతేశ్వరుడి రథచక్రాలు ముందుకు కదిలాయి. రథంపై కామాక్షీదేవి సమేత త్రేతేశ్వరుడు విహరిస్తుండగా గతంలో ఎన్నడూ లేనివిధంగా తరలి వచ్చిన భక్తులు కనులారా స్వామివారిని దర్శించుకొని తరించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పవిత్ర పుణ్య శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న హత్యరాల (అత్తిరాల)లో సోమవారం త్రేతేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకట సుబ్బారెడ్డి, ఈఓ గంగవరం కొండారెడ్డి ఆధ్వర్యంలో త్రేతేశ్వరుడి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్త జనం తరలిరావడంతో హత్యరాల ఎటు చూసినా జనసంద్రమై కనిపించింది. – రాజంపేట టౌన్

క్లుప్తంగా

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం దుంగలు, వాహనంతో ఫారెస్ట్ అధికారులు

పీలేరు : వాహనం, రూ.15 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్వో వెంకటరమణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పీలేరు–చిత్తూరు మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్నారన్న సమాచారంతో అటవీ సిబ్బంది అశోక్‌నగర్ కాలనీ వద్ద నిఘా ఉంచారు. ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా అతివేగంగా వచ్చిన టవేరా వాహనాన్ని డ్రైవర్ ఆపకుండా ముందుకు వెళ్లడంతో ఫారెస్ట్ సిబ్బంది వెంబడించారు. డ్రైవర్ వాహనాన్ని రోడ్డుపక్కన ఆపి పరారయ్యాడు. సిబ్బంది వాహనాన్ని పరిశీలించగా ఎర్రచందనం ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న వాహనం, 265 కేజీల బరువుగల 9 ఎర్రచందనం దుంగలు, విలువ సుమారు రూ. 15 లక్షలు ఉంటుందని ఎఫ్ఆర్వో తెలిపారు. అటవీ సిబ్బంది ప్రతాప్, కుప్పుస్వామి, ప్రభుతేజ, చరణ్, దేవేంద్ర పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు చేయించుకోవాలి



ఈ పంట నమోదునుపరిశీలిస్తున్న ప్రవీణ్

సిద్దవటం : రైతులు ఈ- పంట నమోదు చేయించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ సహాయ సంచాలకుడు డి.ప్రవీణ్ తెలిపారు. మాచుపల్లె రైతు భరోసా కేంద్రం పరిధిలోని మూలపల్లె, అట్లూరు రెవెన్యూ గ్రామంలో రబీలో ఈ- పంట నమోదు వివరాలను సోమవారం క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంట పేరు, సర్వే నంబరు, విస్తీర్ణం, రకం, సాగుదారుని వివరాలు, సాగు నీటి వనరులు, సవ్యంగా ఉన్నాయా లేదా అని రైతులను, సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు, సిద్దవటం వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి, అట్లూరు మండల వ్యవసాయాధికారి జి. రామక్రిష్ణయ్య, రైతు భరోసా కేంద్రం సహాయకులు టి.లక్ష్మిదేవి, అరుణ పాల్గొన్నారు.

మల్బరీ..లాభాల సిరి

- పట్టుకు ప్రభుత్వం చేయూత
- సబ్సిడీతో సిరికల్చర్ షెడ్లు మంజూరు
- జిల్లాలో రెండేళ్లుగా నిలకడగా ఆదాయం



మల్బరీ సాగు రైతులకు అవగాహన కల్పిస్తున్న సిరికల్చర్ అధికారులు

పీలేరు : మల్బరీ సాగు విస్తీర్ణం క్షీణిస్తున్న తరుణంలో ప్రభుత్వం చేయూతనిస్తోంది. రైతులకు వివిధ రకాలుగా రాయితీలు కల్పిస్తుండడం, సిరికల్చర్ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు కల్పిస్తుండడంతో మల్బరీ సాగుకు రైతులు ముందుకు వస్తున్నారు. గతంలో మల్బరీ సాగుకు సరైన ప్రోత్సాహం లేకపోవడం, అనుకున్న మేర ధరలు లేక రైతులు నష్టాలు చవిచూశారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిరికల్చర్ అభివృద్ధికి పలు ప్రోత్సాహకాలు, రాయితీలు తీసుకొచ్చింది. దీంతో మల్బరీ సాగు పట్ల రైతులు ఆసక్తి చూపడంతో రోజు రోజుకు సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతంలో జిల్లాలో 8059 మంది రైతులు 10758 వేల ఎకరాలకు పైగా సాగు చేశారు.

రైతులకు అందుతున్న రాయితీలు..

పట్టు పురుగుల పెంపకం కోసం షెడ్డు నిర్మించుకోవడానికి ఒక్కో రైతుకు ప్రభుత్వం రూ. 3 లక్షలు రాయితీ ఇస్తోంది. అలాగే మల్బరీ సాగు చేయడం కోసం పెట్టుబడిగా ఎకరాకు రూ. 18,750 చొప్పున రాయితీ ఇస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకు 11 మంది రైతులు ప్రభుత్వ రాయితీతో షెడ్లు నిర్మించుకుంటున్నారు. రైతులు పట్టు గూళ్లు విక్రయించిన సమయంలో ఒక కేజీకి రూ. 50 చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహకంగా ఇస్తోంది. మల్బరీ సాగుకు అవసరమైన క్రిమి సంహారక మందులు, ఎరువులకు గానూ రూ. 3,750 చొప్పున రాయితీ ఇస్తోంది.

పట్టుగూళ్ల విక్రయానికి అందుబాటులో మార్కెట్లు..

రైతులు పట్టుగూళ్లు విక్రయించడానికి వీలుగా పలు ప్రాంతాల్లో ప్రభుత్వం విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా ప్రధానంగా మదనపల్లె, పలమనేరు, కుప్పం, హిందూపురం, ధర్మవరం, కదిరి, చేబ్రోలు, హనుమాన్‌జంక్షన్ కేంద్రాలు పట్టు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం సీబీ రకం పట్టు గూళ్లు కేజీ రూ. 500 నుంచి రూ. 650, బైఓల్టిన్ రకం కేజీ రూ. 650 నుంచి రూ. 750 వకు ధర పలుకుతోంది. ఒక ఎకరా సాగు చేయడం ద్వారా ఒక ఏడాదికి 800 నుంచి 1000 కేజీల వరకు పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

పట్టుగూళ్ల ధరలు	
రకం	కేజీ ధర రూ.
సీబీ	650
బైఓల్టిన్	750

జిల్లాలో మల్బరీ సాగు వివరాలు		
డివిజన్	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
మదనపల్లె	9000	7000
రాయచోటి	1758	1059



గుర్రంకొండలో ప్రభుత్వ రాయితీతో మంజూరైన షెడ్డు

ప్రభుత్వ ప్రోత్సాహకం బాగుంది..



మల్బరీ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. రాయితీతో షెడ్డు నిర్మాణం చేపట్టాం. నేను నాలుగు ఎకరాల్లో మల్బరీ సాగు చేశా. మిగతా పంటలతో పోల్చుకుంటే మల్బరీ సాగుతో నికరమైన ఆదాయం వస్తోంది.

- మేఘనాథరెడ్డి, రైతు, వాల్మీకిపురం

పట్టుగూళ్ల ధరలు స్థిరంగా ఉన్నాయి..



రెండేళ్లుగా పట్టుగూళ్ల ధరలు కూడా స్థిరంగా ఉండడంతో రైతుకు లాభదాయకంగానే ఉంది.నేను రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేశా. సిరికల్చర్ అధికారులు తరచూ సూచనలు, సలహాలు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇతర రైతులు కూడా మల్బరీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

- వేణుగోపాల్‌రెడ్డి, వగళ్ల, కేవీపల్లె మండలం

రాయితీలు సద్వినియోగం చేసుకోవాలి



లాభదాయకమైన పంట మల్బరీ సాగుపై రైతులు ఆసక్తి చూపాలి. మల్బరీ ఒకసారి సాగు చేస్తే, 15 నుంచి 18 సంవత్సరాల వరకు కోతకు వస్తూనే ఉంటుంది. ఒక ఏడాదిలో ఐదు పంటలు దిగుబడి చేసుకోవచ్చు. పట్టు పురుగులను సిరికల్చర్ అధికారుల వారంరోజుల పాటు పెంచి రైతులకు ఇస్తారు. రైతులు 20 రోజులు మాత్రమే సంరక్షించాల్సి ఉంటుంది. ప్రభుత్వ రాయితీలు రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

- రాజశేఖర్‌రెడ్డి, జిల్లా సిరికల్చర్‌అధికారి

లక్కిరెడ్డిపల్లెలో వ్యక్తి దారుణ హత్య



హత్యకు గురైన బత్తల రామసుబ్బయ్య

లక్కిరెడ్డిపల్లె: మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెలోని కొత్త కొట్టాలలో నివాసం ఉంటున్న బత్తల రామసుబ్బయ్య(52) సోమవారం దారుణహత్యకు గురయ్యాడు. ఎస్ఐ వినోద్‌కుమార్ కథనం మేరకు వివరాలు.. చెన్నూరు బొప్పంపల్లె కి చెందిన రామసుబ్బయ్య బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి కడపలోని అలంకాన్‌పల్లెకు చెందిన లలితమ్మతో ఐదేళ్లుగా అక్రమ సంబంధం ఉంది. ఇద్దరు కలిసి లక్కిరెడ్డిపల్లెలో నివాసం ఉంటున్నారు.ఆమె కూడా కూలిపనులకు వెళుతుంది. లలితమ్మకు మునీంద్రా అనే కుమారుడు ఉన్నాడు. ఇతను సోమవారం లక్కిరెడ్డిపల్లెకు వచ్చాడు.అదే సమయంలో రామసుబ్బయ్య, లలితమ్మ గొడవపడుతుండగా మునీంద్రా రామసుబ్బయ్యను కత్తితో పొడిచి హత్య చేశాడు. లక్కిరెడ్డిపల్లె పోలీసులు నిందితుడు మునీంద్రను అదుపులోకి తీసుకున్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

502 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం బస్తాలు

సిద్దవటం : కమ్మపాల్లె గ్రామంలో అక్రమంగా తరలించేందుకు నిల్వ ఉంచిన 502 బస్తాల ప్రభుత్వ రేషన్ బియ్యం డంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎస్ఐ తులసీ నాగప్రసాద్ మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. సిద్దవటం మండలం కమ్మపాలెం గ్రామం లోని పాత చర్చిలో బియ్యం నిల్వ ఉండటాన్ని గమనించి వీటిని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని నాగరాజు, నాగమునిరెడ్డి, సురేంద్రలు కొనుగోలు చేసి కమ్మపాలెం గ్రామంలో నిల్వ ఉంచారు. స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాల విలువ దాదాపు రూ.4.10 లక్షలు ఉంటుందని ఎస్ తెలిపారు. నాగరాజు, నాగమునిరెడ్డి, సురేంద్రలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బియ్యం బస్తాలను సిద్దవటం తహసీల్దారు శంకరయ్యకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నాయక్, పోలీసు సిబ్బంది, విఆర్వో కేశవులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి,కుమారుడి ఆత్మహత్యాయత్నం

కడప అర్బన్/జమ్మలమడుగురూరల్ : వైఎస్సార్‌జిల్లా కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోకి సోమవారం ఆరుగురు సభ్యులతో కూడిన ఓ కుటుంబం వచ్చింది. కుమారుడు రొద్దంగాళ్ల చిన్నబాలయ్య (35) అతని తల్లి మేరీ (65) అనే మహిళ కిరోసిన్ శరీరంపై పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా అక్కడే విధులను నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది వారిని అడ్డుకున్నారు. నీళ్లు పోసి, వారి ప్రయత్నాన్ని విరమింపజేశారు. చిన్నబాలయ్య భార్య, అతని ఇద్దరు కుమార్తెలు, కుమారుడు, తల్లి మేరీతో కలిసి సోమవారం కడపలోని పోలీసు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా బాధితుడు మీడియాతో మట్లాడారు.తాను కొండాపురం మండలం సుగుమంచిపల్లెలో నివాసం ఉంటానని, తమకు కేటాయించిన స్థలాన్ని చూసుకునేందుకు ఈనెల 12న వెళ్లగా ఆ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు తిరుపతయ్య, మరో ఇద్దరు డిపార్ట్‌మెంట్ వారు వచ్చి దాడి చేశారన్నారు. పోలీసువారు సెల్‌ఫోన్‌ను లాక్కుని దాడి చేయడమేగాక బెదించారన్నారు. తమకు జరిగిన అన్యాయంపై తట్టుకోలేక ఉన్నతాధికారులతో చెప్పుకుందామని, ఈనెల 13న భార్యతో కొండాపురం నుంచి రైలులో కడప రైల్వేస్టేషన్‌కు వచ్చి అక్కడ విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించగా తన భార్య గమనించి 108లో రిమ్స్‌లో చేర్పించిందని చిన్నబాలయ్య తెలిపారు. ఈనెల 17న పోలీసు అధికారులు రిమ్స్‌కు వచ్చి విచారించి వెళ్లారన్నారు. తరువాత తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. తిరుపతయ్యతోపాటు, మరో ఇద్దరిపై కేసు నమోదు చేయాల్సి ఉండగా కేవలం హోంగార్డు తిరుపతయ్యపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టారన్నారు.తమకు అన్యాయం జరుగుతుందని భావించి, కుటుంబసభ్యులతో పాటు వచ్చి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించామన్నారు. సంఘటన జరిగిన వెంటనే వారిని రిమ్స్‌కు తరలించారు.

వచ్చేనెల 9 నుంచి టెక్ మారథాన్ ప్రోగ్రాం



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి తదితరులు

రాజంపేట : అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ (ఏఐటీఎస్) కళాశాలలో వచ్చేనెల 9 నుంచి 11 వ తేదీ వరకు జరిగే టెక్‌మారథాన్ ప్రోగ్రాంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం దీనికి సంబంధించిన పోస్టర్లను ఆయన విడుదల చేశారు.అనంతరం మాట్లాడుతూ నేటి సమాజంలో సాంకేతికపరంగా వస్తున్న నూతన పోకడలపై పట్టు సాధించేందుకు నిర్వహిస్తున్న సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ కృత్రిమమేథస్సు, ఇంటర్‌నెట్, డేటా విశ్లేషణ అనే అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. కన్వీనర్ డా.ఎం.సుబ్బారావు మాట్లాడుతూ విజేతలకు బహుమతులు కూడా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకాడమిక్ డా.మల్లికార్జునరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.శ్రీనువాసరావు, కో–ఆర్డినేటర్ రఫీ, పరిపాలనాధికారి నూకా సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టీ.రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ఒకరి మృతి



వెంకటేష్ మృతదేహం

పీలేరురూరల్ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడిన సంఘటన స్థానిక మదనపల్లె రోడ్డు మార్గంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణం బాపూజీ నగర్‌కు చెందిన బండి వెంకటేష్ (35), కోళ్లఫారానికి చెందిన కె. సరస్వతి (38) సోమవారం ఉదయం స్థానిక మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ లేఅవుట్ వైపు నుంచి ద్విచక్రవాహనంలో పీలేరుకు బయలుదేరారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కె. భరత్ (29) తిరుపతి నుంచి మదనపల్లెకు ద్విచక్రవాహనంలో వస్తున్నాడు. స్థానిక మదనపల్లె రోడ్డు మార్గంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ సరస్వతి, భరత్‌ను చికిత్సనిమిత్తం 108లో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

నిమ్మనపల్లె : మండల పరిధిలోని రాచవేటివారిపల్లె పంచాయతీ బొంతలవారిపల్లె సమీపంలోని బిల్లిమేకలగుట్ట వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామసమీపంలోని అటవీప్రాంతంలో శరీరంపై కేవలం డ్రాయర్ మాత్రమే కలిగి శవం కుళ్లిపోయి, దుర్వాసనతో పురుగులు పట్టి, గుర్తించలేని స్థితిలో ఉండటాన్ని గొర్రెలకాపరులు గుర్తించారు. సమాచారాన్ని నిమ్మనపల్లె పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ ఫాతిమా పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం చుట్టుపక్కల గ్రామాల్లో వ్యక్తి అదృశ్యంపై సమాచారం సేకరించారు. అందులో భాగంగా గుండ్లబురుజు హరిజనవాడకు చెందిన గుర్రప్ప కుమారుడు చెక్కల మల్లికార్జున(44) వారంరోజుల నుంచి కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. వెంటనే అతని అన్న సుధాకర్, అమ్మ గుర్రమ్మ, కుమార్తె సౌజన్య, అల్లుడు మురళీలను సంఘటనాస్థలానికి పిలిపించారు. వారు మృతదేహాన్ని చూసి మల్లికార్జునగా నిర్ధారించారు. మృతుని వివరాలను పోలీసులకు తెలిపారు. మృతుడు చాలా సంవత్సరాల క్రితమే మదనపల్లె దిగువ కమ్మపల్లెలో స్థిరపడి ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండేవాడని, మొదటిభార్య కరుణను వదిలి, మరో మహిళతో జీవనం సాగించేవాడన్నారు. భార్యాపిల్లలు దూరమవడం, సహజీవనం చేస్తున్న మహిళ మృతిచెందడంతో మానసికంగా కృంగిపోయిన మల్లికార్జున అనారోగ్యం బారిన పడ్డాడు. మూర్ఛవ్యాధితో పాటు ఇటీవల మతిస్థిమితం లేకుండా పోవడంతో కుటుంబసభ్యులు మదనపల్లె నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చారు. బయటకు వెళ్లనివ్వకుండా ఇంట్లో ఉంచారు. ఈనెల 14న తనను ఉంచిన ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. అప్పటినుంచి కుటుంబసభ్యులు అతని జాడ కోసం వెతుకుతున్నారు. ఈక్రమంలో సోమవారం బిల్లిమేకలగుట్ట వద్ద అతని మృతదేహం లభించడంతో తల్లి గుర్రమ్మ పోలీసులకు ఫిర్యాదుచేసింది. సంఘటనాస్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్ఐ ఫాతిమా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోసిలి పడదాం..గుండె లోతుల్లో దాచుకుందాం

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


మదనపల్లె సిటీ : మాతృభాషపై పట్టు ద్వారా సంపూర్ణ వ్యక్తిత్వాన్ని సంతరించుకుని తద్వారా పటిష్టమైన జాతి నిర్మాణం సాధ్యమవుతుందని పలువురు భాషా వేత్తలు చెబుతున్నారు. ఫిబ్రవరి 21వతేదీని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితిని యునెస్కో 1999లో ప్రకటించింది. ప్రపంచదేశాలు వారి మాతృభాషా పరిరక్షణ, భిన్న సంస్కృతుల కాపాడుకోవడమే ధ్యేయంగా కృషి చేయాలని తీర్మానం చేసింది. ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగుభాషా భవిష్యత్తులో అంతరించే భాషల జాబితాలో లేకుండా చూసేందుకు మన అమ్మ భాషను రక్షించుకునేందుకు అందరం మరింత బాధ్యతగా కృషి చేయాల్సి ఉంది. అంతర్జాతీయ భాషా దినోత్సవం సందర్భంగా మదనపల్లెకు చెందిన ప్రముఖ సాహితీవేత్తల గురించి ప్రత్యేక కథనం..

విశ్రాంత ఉద్యోగి సాహితీ సేద్యం



మదనపల్లె పట్టణం రామారావు కాలనీకి చెందిన టీఎస్ఏ కృష్ణమూర్తి మున్సిపాలిటీలో విశ్రాంత ఉద్యోగి. 1968 నుంచి కతలు, నవలలు రాయడం ప్రారంభించారు. ఉత్తమ నవలా రచయితగా ఖ్యాతి గడించారు. 200 కథలు, 10 నవలికలు, 5 నవలలు, కథా సంపుటులు రచించారు. ఈయన రచించిన నవలల్లో కొత్తబంగారు లోకం పేరు తెచ్చి పెట్టింది. ఈ నవలకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, హైదరాబాదుకు చెందిన సీపీ బ్రౌన్ అకాడమీ స్వాతి పురస్కారం, రచన కథా పీఠం పురస్కారం, కుప్పం రెడ్డమ్మ ప్రోత్సాక అవార్డు, నెల్లూరు కడవలూరు బలరామయ్య అవార్డులు వరించాయి. నేటికీ ఆయన తెలుగుభాషాభివృద్ధి కోసం అవిశ్రాంత కృషి చేస్తున్నారు.

దృశ్య కవితలో రారాజు.. నాగరాజు



ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో మంది విద్యార్థులు భవిష్యత్తుకు బాటలు వేసిన వీఎం నాగరాజు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తన లక్ష్యాన్ని కొనసాగిస్తున్నారు. దృశ్య కవితలు, పద్యాలను రచించి నేటి తరం విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన వందల సంఖ్యలో దృశ్య కవితలు, పద్యాలు రాశారు.

మాతృభాషాభివృద్ధే లక్ష్యంగా..



మదనపల్లె పట్టణం మోతీనగర్‌కు చెందిన పఠాన్ మహమ్మద్‌ఖాన్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. 20 సంవత్సరాలుగా ఉర్దూ భాషలో అనేక కవితలు, గజల్స్, హమ్ద్,నాతే షరీఫ్‌లు రాసి ఉత్తమ కవిగా ఖ్యాతి గడించారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక ఉర్దూ సెమినార్లు, కవి సమ్మేళనాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ నుంచి రెండు సార్లు రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. పట్టణంలోని హజరత్ ఖాదర్‌షా ఔలియా దర్గాలో ఏటా జరిగే అఖిల భారత ఉర్దూ కవి సమ్మేళనంలో గత 25 సంవత్సరాలుగా కవి సమ్మేళనం కన్వీనర్‌గా వ్యవహరిస్తూ ఉర్దూభాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు.ఆయన కలం పేరు జోహర్.

ఉర్దూ సాహితీ ప్రపంచంలో ధృవతార ఖమర్



ఉర్దూ సాహితీ ప్రపంచంలో ధృవతార ఖమర్ అమీని. మదనపల్లె పట్టణం దేవళంవీధిలో నివాసమున్న విశ్రాంత ఉపాధ్యాయుడు ఖమర్ అమీనీ. ఆయన అసలు పేరు బాబా ఫక్రుద్దీన్. 1965 నుంచి ఉర్దూ,హిందీ భాషలల్లో వేలాది గజల్స్,కవితలు నాతే షరీఫ్‌లు రాసి జాతీయ స్థాయి ఖ్యాతి గడించారు. ఈయన రచించిన తవ్వాఫ్–ఏ–గజల్, కష్కోల్–ఏ–ఖల్బ్–ఓ–నజర్,నాత్‌కి అంజుమన్‌కు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయి. కడప పెద్ద దర్గా, కలిచెర్ల మౌలాకా పహాడ్ దర్గాలతో పాటు స్థానికంగా జరిగే జాతీయ స్థాయి ఉర్దూ కవి సమ్మేళనాలలో అనేక ప్రశంసలు, అవార్డులు అందుకున్నారు. పదవి విరమణ చెంది 20 సంవత్సరాలు దాటినా ఇప్పటికీ ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

లండన్ నుంచి వచ్చి..



చంటిబిడ్డతో షబానా

తంబళ్లపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మారుమూల గ్రామాల్లో సైతం మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయనే విషయాన్ని దేశ, విదేశాల్లో టీవీల ద్వారా తిలకించాం. లండన్ నుంచి పురిటి కోసం పుట్టినింటికి వచ్చి మండలంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సుఖప్రసవం పొందిన ఎన్ఆర్ఐ మహిళా ఉద్యోగిని తన అభిప్రాయాన్ని వెల్లడించింది. తంబళ్లపల్లెకు చెందిన బీబీజాన్, బాషా దంపతుల కుమార్తె షబానాను తిరుపతికి చెందిన అజగర్‌ఖాన్ ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తలిద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా లండన్‌లో స్థిరపడ్డారు. షబానా రెండో సారి గర్భం దాల్చింది. పురుడు పోసుకునేందుకు నెల రోజుల కిత్రం తంబళ్లపలె వచ్చింది. తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పావని,ఆశాలతల ఆధ్వర్యంలో అన్ని పరీక్షలు చేశారు. ఆదివారం రాత్రి పురిటి నొప్పులు రాగానే ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. సుఖప్రసవం జరిగింది. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. పాప ఆరోగ్యంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రిలో నమ్మకంతో చేరినట్లు షబానా ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

మదనపల్లె : పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ సోమవారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందింది. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం ఎల్లారబైలుకు చెందిన శంకరప్ప భార్య రెడ్డెమ్మ (35) వ్యవసాయ పనులు చేస్తుండేది. కుటుంబసమస్యలతో మనస్తాపం చెంది ఆదివారం పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. ఈమేరకు పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.